WANTED REPORTERS
నవతరం తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com

www.navatharam.com

# నవతరం

సామాజిక, రాజకీయ తెలుగు దినపత్రిక

| హైదరాబాద్ | శుక్రవారం | సంపుటి: 9 | సంచిక: 225 | పేజీలు: 04 | వెల: 5 రూ/- | 14 ఆగస్టు 2026 |

## హిందూ ముస్లింల మధ్య నాకు వ్యత్యాసం లేదు



- వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమితులైన అభ్యర్థులు తెలంగాణ రైజింగ్ కోసం పనిచేయాలి
- హిందూ - ముస్లింలు ఇద్దరూ నాకు రెండు కళ్లలాంటి వారన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవతరం: బంజారాహిల్స్ లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ మైనారిటీల ప్రతిభా సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. గ్రూప్ 1, 2, 3, 4 తదితర కేటగిరీల్లో జరిగిన ఉద్యోగ నియామకాల్లో ఎంపికైన, అలాగే నీట్, ఐఐటీ, ఎన్ఐటీ లాంటి జాతీయ స్థాయి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 782 మంది మైనారిటీ అభ్యర్థులకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, TGMREIS ప్రెసిడెంట్ మహమ్మద్ ఫహీముద్దీన్ ఖురేషి తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

ప్రజాప్రభుత్వం మైనారిటీల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. "చదువొక్కటే మన భవిష్యత్తును మార్చుతుంది. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు చదువుకోవాలి. ఆ తర్వాత నుంచి విద్యార్థులు స్కిల్స్ పై దృష్టి సారించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో స్కిల్స్ ఉంటే ఉద్యోగావకాశాలకు కొదవలేదు. స్కిల్స్ ఉన్నవారికి జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. స్కిల్స్‌లో యువతను సిద్ధం చేయాలన్న లక్ష్యంతోనే ఐటీఐలను ఏటీసీలుగా మార్పు చేశాం. పాలిటెక్నిక్ కాలేజీలను స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తెచ్చాం. నైపుణ్యం ఉంటే భవిష్యత్తు మారుతుంది. ఎంతో కష్టపడుతున్న చిన్న చిన్న కుటుంబాల నుంచి ఎంతగానో కృషి చేసి ఈ ఉద్యోగాలు సాధించుకున్న మీ అందరికీ అభినందనలన్నారు. మైనారిటీలకు కల్పించిన 4 శాతం రిజర్వేషన్లను తొలగించాలన్న ప్రయత్నాలు జరిగాయి. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా సాధ్యం కాలేదు. సంక్షేమ కార్యక్రమాల్లో మైనారిటీలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వల్ల మైనారిటీలకే ఎక్కువగా ప్రయోజనం పొందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రూప్ -1 తో పాటు ఉద్యోగ నియామకాలేవీ జరగలేదు. గ్రూప్ - 1 కు సంబంధించి ఒకసారి ప్రయత్నం జరిగినప్పటికీ పల్లీ బఠానీల్లా పరీక్షా పత్రాలను మార్కెట్ లో విక్రయించారు. గ్రూప్ -1, 2 లాంటి పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయాలంటే పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో అర్హత కలిగిన వారు సభ్యులుగా ఉండాలి. అనామకులను సర్వీసు కమిషన్‌లో నియమించారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మిగతా.. 3 పేజీ లో

## ప్రఖ్యాత 'న్యూయార్క్ టైమ్స్'లో అమరావతిపై స్పెషల్ స్టోరీ



- అమరావతి నిర్మాణంపై ప్రఖ్యాత 'న్యూయార్క్ టైమ్స్' ప్రత్యేక కథనం
- భారత్‌లోనే అత్యంత నివాసయోగ్య నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- అత్యాధునిక టెక్నాలజీతో 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటుకు సన్నాహాలు
- 60 శాతం పచ్చదనం, నీటితో పర్యావరణ హితంగా రాజధాని డిజైన్
- ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పంతో వేగంగా సాగుతున్న పనులు

అమరావతి, నవతరం: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి దేశానికే ఒక ఆదర్శంగా నిలవాలని, జీవన ప్రమాణాల్లో కొత్త బెంచ్‌మార్క్‌ను సృష్టించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. అమరావతిపై తమ ప్రభుత్వ విజన్‌కు అంతర్జాతీయ పత్రిక 'ది న్యూయార్క్ టైమ్స్'లో చోటు దక్కడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు.

"కేవలం ఒక గొప్ప రాజధానిని నిర్మించడమే మా లక్ష్యం కాదు. భారతదేశంలో జీవన ప్రమాణాలకు సరికొత్త కొలమానాన్ని నిర్దేశించడమే మా ఆశయం" అని చంద్రబాబు పేర్కొన్నారు. హరిత నగరం, సమర్థవంతమైన, అందరినీ కలుపుకొనిపోయే నగరంగా, నాణ్యమైన జీవనశైలితో అమరావతిని తీర్చిదిద్దాలన్నదే తమ ధ్యేయమని వివరించారు. ప్రపంచస్థాయి పట్టణ జీవనం అనేది ఒక సుదూర ఆదర్శం కాదని, భారత్ కూడా అలాంటి నగరాలను నిర్మించగలదని అమరావతి నిరూపిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "మా లక్ష్యం ఆశయపూరితమైనదే, కానీ అది సాధించగలిగేదే. అమరావతి దేశానికి ఒక ఉదాహరణగా నిలవాలి" అని చంద్రబాబు తన పోస్టులో స్పష్టం చేశారు. ఈ పోస్టుతో పాటు న్యూయార్క్ టైమ్స్‌లో అమరావతిపై వచ్చిన కథనం లింకును కూడా ఆయన పంచుకున్నారు.

అమరావతిపై 'న్యూయార్క్ టైమ్స్' ప్రత్యేక కథనం ఇదే.. ఒక వ్యక్తి సంకల్పంతో రూపుదిద్దుకుంటున్న నగరం!

ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతి నిర్మాణం ఇప్పుడు అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతా.. 3 పేజీలో

## ఖర్గేకు అవమానం.. రాష్ట్రవ్యాప్త నిరసనలకు షర్మిల పిలుపు

- ఖర్గే పర్యటించిన స్థలాన్ని శుద్ధి చేయడంపై షర్మిల తీవ్ర ఆగ్రహం
- ఇది దళితుల వ్యక్తిత్వానికి జరిగిన అవమానమంటూ విమర్శ
- బీజేపీ కుల వివక్షకు, విభజన రాజకీయాలకు నిదర్శనమని ఆరోపణ
- ఆగస్టు 14న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, సత్యాగ్రహానికి పిలుపు



అమరావతి, నవతరం: కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు అవమానం జరిగిందంటూ, బీజేపీపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానిలో ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని బీజేపీ, హిందుత్వ సంస్థలు గంగాజలంతో శుద్ధి చేయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది బీజేపీ కుల దురహంకారానికి, దళిత వ్యతిరేక విధానాలకు నిదర్శనమని ఆరోపిస్తూ రేపు (ఆగస్టు 14) రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చారు.

ఈ ఘటనపై షర్మిల తీవ్రంగా స్పందించారు. "బీజేపీ చేసిన హవనం.. దళితుల వ్యక్తిత్వానికి జరిగిన హననం" అని ఆమె అభివర్ణించారు. దళితుల పట్ల వివక్ష చూపడమే బీజేపీ సిద్ధాంతమని, కులమతాల మధ్య విభేదాలు సృష్టించడం ఆ పార్టీ మనస్తత్వమని విమర్శించారు. రామ్ లీలా మైదానంలో ఖర్గే అడుగుపెట్టిన స్థలాన్ని శుద్ధి చేయడం బీజేపీ పాటిస్తున్న అంటరానితనానికి, అసమానతలకు అద్దం పడుతుందని ఆమె మండిపడ్డారు. ఇది సభ్యసమాజం సిగ్గుతో తలవంచుకోవాల్సిన చర్య అని, రాజ్యాంగ విలువలను తునాతునకలు చేసే ఈ రాక్షస చర్యను యావత్ దేశం ఖండిస్తోందని తెలిపారు.

ఈ సిగ్గుమాలిన చర్యను నిరసిస్తూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఉద్యమిస్తోందని, అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు షర్మిల ప్రకటించారు. ఆగస్టు 14వ తేదీ సాయంత్రం ప్రతి జిల్లా కేంద్రంలో డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఆధ్వర్యంలో భారీ మార్చ్, సత్యాగ్రహం నిర్వహించాలని ఆమె పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఈ మార్చ్‌ను స్థానిక అంబేడ్కర్ లేదా గాంధీ విగ్రహాల వద్ద ముగించి, ఖర్గేకు సంఘీభావంగా సత్యాగ్రహం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీ, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలు, పార్టీ అనుబంధ విభాగాలు, నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని షర్మిల కోరారు. ఇటువంటి వివక్ష, విభజన కుట్రలను దేశ ప్రజలు సహించబోరని బీజేపీకి శక్తివంతమైన సందేశం పంపాలని ఆమె పిలుపునిచ్చారు.

## చంచల్‌గూడ స్టీల్ బ్రిడ్జ్‌కు సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి

- సీఎం రేవంత్ రెడ్డికి వీహెచ్ లేఖ
- చంచల్‌గూడ నుంచి సంతోష్‌నగర్ వరకు కొత్త స్టీల్ బ్రిడ్జ్
- సంగం లక్ష్మీబాయి సేవలు చరిత్రలో మరుపురానివన్న వీహెచ్
- మూడుసార్లు ఎంపీగా గెలిచిన తొలి మహిళగా రికార్డు సృష్టించారని కితాబు

హైదరాబాద్, నవతరం: నగర పరిధిలోని చంచల్‌గూడ నుంచి సంతోష్‌నగర్ వరకు నూతనంగా నిర్మించిన స్టీల్ బ్రిడ్జ్‌కు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, విద్యావేత్త సంగం లక్ష్మీబాయి పేరుతో నామకరణం చేయాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి.హనుమంతరావు కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా లేఖ రాశారు.

భారత స్వాతంత్ర్య పోరాటంలో, ఆ తర్వాత సమాజ సేవలో సంగం లక్ష్మీబాయి అందించిన నిరుపమాన సేవలు చరిత్రలో మరపురానివని వీహెచ్ తన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ నేలకు చెందిన వీరనారిగా, నిజాం నిరంకుశత్వానికి, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ఉద్యమించడమే కాకుండా, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష కూడా అనుభవించారని పేర్కొన్నారు.

స్వాతంత్ర్యానంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా అల్వాల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, ఉప విద్యామంత్రిగా సేవలు మిగతా.. 3 వ పేజీలో..



## దశాబ్దాల ప్రజాస్వామ్యంలోనూ అసంపూర్ణ సామాజిక న్యాయం

- పెట్టుబడిదారీ విధానాలకు కళ్లెం వేయాలి, ప్రభుత్వ రంగ బలోపేతం, రైతు సంక్షేమే దేశ భవిష్యత్తు
- ప్రధానికి శిరిగిరి వరదరాజు బహిరంగ లేఖ



శ్రీకాకుళం, నవతరం: "పుష్కర కాలం పాలించినా సామాన్యుడి కన్నీరు ఆరకపోతే ప్రజాస్వామ్యానికి అర్థం ఏమిటి?" అంటూ నవచైతన్య యువజన సేవా సమితి వ్యవస్థాపక చైర్మన్ శిరిగిరి వరదరాజు ప్రధాని నరేంద్ర మోడీకి బహిరంగ లేఖ రాశారు. దేశంలో ప్రజాస్వామ్యం ఏర్పడి ఎనిమిది దశాబ్దాలు నిండుతున్న తరుణంలో కూడా అర్హత ప్రామాణికంగా కొన్ని వర్గాలకు న్యాయం జరగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకే చట్టం - ఒకే ధర్మం - ఒకే న్యాయం" అనేది ఇప్పటికీ కాగితాలకే పరిమితమైందని, కోట్లాది మంది సమన్యాయం కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. నేడు దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ బలంగా పావులు కదుపుతోందని, దీనిని అరికట్టకపోతే ప్రజాస్వామ్య ఉనికే ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. సామాన్య మధ్య తరగతి కుటుంబం నుండి వచ్చిన ప్రధాని మోడీ ఈ వాస్తవాలను గుర్తించి దేశంలో ప్రశాంత వాతావరణం కోసం ప్రాధాన్యత కల్పించాలని కోరారు. స్వాతంత్ర దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరుపుకోవడం ఆనందమే అయినా, ఆ స్వాతంత్ర లక్ష్యాలను నెరవేర్చడంలో పాలకులకు చిత్తశుద్ధి లోపిస్తోందని విమర్శించారు. "ప్రచారాని కి స్వాతంత్ర దినం కాదు, ఫలితాల కోసం స్వాతంత్ర దినం కావాలి" అని ఆయన అన్నారు. స్వాతంత్ర తొలి నాళ్లలో ఉన్న నిబద్ధత, నిజాయితీ నేడు కరువైందని, అవినీతి, అక్రమాలు, ఔర్జన్యాలు శృతి మించాయని ఆరోపించారు. జాతి ప్రయోజనాల కోసం నిర్మించే కట్టడాలు, రోడ్లు, భవనాలు నాణ్యత లేక సంవత్సరాలలోపే శిథిలమవుతున్నాయని, ఇది ప్రజాధన దుర్వినియోగానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వ రంగం బలహీనపడిందని, భారతదేశంలో పుష్కలంగా ఉన్న మానవ వనరుల వినియోగం, నిరుద్యోగ సమస్య పరిష్కారం ప్రభుత్వ రంగం ద్వారానే సాధ్యమని స్పష్టం చేశారు. దీర్ఘకాలం సేవ చేసి పదవీ విరమణ చెందిన ఉద్యోగులు, వాలంటరీ తీసుకున్న వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగం క్షీణిస్తున్న నేపథ్యంలో నేషనల్ వైడ్ కల్టివేషన్ కార్పొరేషన్ ఏర్పాటు, ధరల స్థిరీకరణ, పద్దెనిమిది నుండి డెబ్బై ఏళ్ల రైతులకు ప్రభుత్వ ఇన్సూరెన్స్ తప్పనిసరని సూచించారు. "ఓటు అనేది ప్రజాస్వామ్య వజ్రాయుధం" అని, కానీ నేడు చాలా మంది పౌరులు ఓటు హక్కును కూడా పొందలేని దుస్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ బ్యాంకుల నుండి ప్రముఖులు తీసుకునే వేల కోట్ల అప్పుల మాఫీని అరికట్టి, సామాన్యుడికి బ్యాంకు సేవలు అందేలా చూడాలని, పిపిపి విధానం ద్వారా వ్యవస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని నివారించాలని కోరారు. పదవీ విరమణ చేసిన జర్నలిస్టులకు జాతీయస్థాయిలో పెన్షన్, ఆరోగ్య పరిరక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రానున్న స్వాతంత్ర దినోత్సవం నాటికైనా న్యాయం జరగని వర్గాలకు న్యాయం చేస్తేనే అది నిజమైన స్వాతంత్ర వేడుక అవుతుందని శిరిగిరి వరదరాజు ఆకాంక్షించారు.

## ఆ స్థలాలు ఎక్కడికీ పోవు.. నేను హామీ ఇస్తున్నా

- నిషేధిత జాబితాలోని (22ఏ) భూములకు బై-నంబర్లు ఇస్తామని సీఎం హామీ
- కూకట్‌పల్లి కేపీహెచ్‌బీలో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన
- పేదలకు వారు నివసించే ప్రాంతంలోనే ఇళ్లు నిర్మించి ఇస్తామని వెల్లడి
- ఇందిరమ్మ ఇళ్లకు రిజిస్ట్రేషన్ ఛార్జీలు రద్దు చేయాలని మంత్రులకు ఆదేశం
- రెండేళ్లలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్న సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవతరం: రాష్ట్రంలో నిషేధిత జాబితాలో (22ఏ) చేర్చిన భూముల విషయంలో హక్కుదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. కోర్టు కేసుల కారణంగా మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో చేర్చిన సందర్భాల్లో, వివాదంలో లేని భూములకు బై-నంబర్లు కేటాయించి సమస్యను పరిష్కరిస్తామని ఆయన స్పష్టం చేశారు.

గురువారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో కోర్ అర్బన్ (CURE) ప్రాంత పరిధిలో నిర్మించనున్న 'ఇందిరమ్మ ఇండ్లు (టవర్స్)' నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన భూమిపూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 22ఏ భూముల సమస్యపై కీలక హామీ ఇచ్చారు. "ఏదైనా కారణంగా మీ భూమి 22ఏ జాబితాలోకి చేరితే, కొనుగోలు చేసిన హక్కుదారుల స్థలాలు ఎక్కడికీ పోవు. నేను హామీ ఇస్తున్నా. కోర్టు కేసుల్లో ఉన్న కొంత భూమి కోసం మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో పెట్టారు. ఆ వివాదాస్పద భూమిని పక్కనపెట్టి, మిగతా వాటికి బై-నంబర్లు ఇచ్చి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పిస్తాం" అని స్పష్టం చేశారు.

కూకట్‌పల్లిలో 11 ఎకరాల అత్యంత విలువైన స్థలంలో పేదల కోసం ఇందిరమ్మ టవర్స్ నిర్మించడం గొప్ప సంకల్పమని సీఎం అన్నారు. నగరంలో నిరుపేదలు ఎక్కడ నివసిస్తుంటే అక్కడే వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ ఇళ్ల నిర్మాణానికి అయ్యే వ్యయంలో లబ్ధిదారులు ఐదారు లక్షలు భరిస్తే, నిర్మాణ నాణ్యతను పర్యవేక్షించే హక్కు కూడా వారికి ఉంటుందన్నారు.

పేదలపై భారం తగ్గించేందుకు ఈ ఇళ్లకు రిజిస్ట్రేషన్ ఛార్జీలను కూడా రద్దు చేయాలని వేదికపైనే మంత్రులకు సూచించారు. మొదటి విడతలో కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, ఎల్బీనగర్ వంటి వలస కార్మికులు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్టు వివరించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, గత ప్రభుత్వంలోని ఏ పథకాన్నీ ఆపలేదని, అదనంగా ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వంటి పథకాలతో పేదలకు అండగా నిలుస్తున్నామన్నారు. రెండేళ్లలోనే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని గుర్తు చేశారు.

కూకట్‌పల్లి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, రోడ్లు, ఫ్లైఓవర్లు, చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబుకు సూచించారు. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపించడానికి తాను రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని, ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు.

## ఎంపీడీఓలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నమ్మకాన్ని నిలబెట్టాలి

- 560 మంది మండల నోడల్ అధికారులకు శిక్షణా కార్యక్రమం
- అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి
- ప్రజా సమస్యలను పరిష్కరించడానికి అంకితభావంతో పనిచేయాలని సూచన
- కార్యక్రమంలో పాల్గొన చిన్నారెడ్డి, విద్యాసాగర్, వేముల శ్రీనివాసులు, దివ్య దేవరాజన్
- రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇన్‌చార్జ్ డా. జి. చిన్నారెడ్డి

హైదరాబాద్, నవతరం: అధికారులు తాము ప్రజలకు జవాబుదారీగా ఉంటామనే విషయాన్ని ఎన్నడూ మర్చిపోకూడదని, ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రాథమిక లక్ష్యంగా అంకితభావంతో, బలమైన బాధ్యతా స్ఫూర్తితో తమ విధులను నిర్వర్తించాలని రాష్ట్ర స్థాయి ప్రజావణి ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్-ఛైర్మన్ డా. జి. చిన్నారెడ్డి అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి మండల నోడల్ అధికారులుగా నియమితులైన 560 మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారుల (ఎంపీడీఓల) కోసం గురువారం మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్‌లో నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి డాక్టర్ చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ, తమ సమస్యలకు పరిష్కారం కోరుతూ ప్రజావనిని ఆశ్రయించే ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మండల నోడల్ అధికారులు, మండల స్థాయిలోని వివిధ శాఖల అధికారులకు కీలక బాధ్యత ఉందని అన్నారు. గ్రామాల నుండి వచ్చే పౌరులతో అధికారులు ఓపికగా మాట్లాడాలని, వారి సమస్యలను శ్రద్ధగా వినాలని, వారి దరఖాస్తులను స్వీకరించాలని, సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలోనే వాటిని పరిష్కరించడానికి సాధ్యమైన అన్ని ప్రయత్నాలు చేయాలని ఆయన అన్నారు. "ప్రజలే యజమానులు" అని, వారికి సేవ చేయడమే ప్రతి ప్రభుత్వ అధికారి ప్రాథమిక బాధ్యత అని డాక్టర్ చిన్నారెడ్డి అధికారులకు గుర్తు చేశారు. పరిపాలన ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి నిజమైన అవసరాలకు స్పందించాలని ఆయన నొక్కి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోండి, మండల ప్రజావని నోడల్ అధికారులుగా సేవ చేసే ముఖ్యమైన బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని డాక్టర్ చిన్నారెడ్డి ఎంపీడీఓలకు పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి, పౌరుల ప్రశంసలు, నమ్మకాన్ని సంపాదించడానికి ప్రజావని వేదికను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆయన వారిని కోరారు. నిజమైన సమస్యలతో ప్రభుత్వాన్ని ఆశ్రయించే వారికి తగిన సహాయం, ఉపశమనం అందేలా చూస్తూ, పేద, అణగారిన ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ప్రజావని ఒక సమర్థవంతమైన వేదికగా మారాలని ఆయన అన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమం సమస్యల పరిష్కారంలో 75 శాతం విజయం సాధించిందని డాక్టర్ చిన్నారెడ్డి పేర్కొన్నారు. జిల్లా, మండల స్థాయిలలో ప్రజావని బాధ్యతగల అధికారులు అదే నిబద్ధతతో పనిచేయాలని, తమ ముందుకు వచ్చిన సమస్యలను పరిష్కరించడంలో సమర్థవంతమైన ఫలితాలను సాధించడానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మండల స్థాయిలో బాధ్యతలు అప్పగించిన అధికారులు ఒకరితో ఒకరు సమన్వయంతో పనిచేస్తూ, తమ విధులను నిర్వర్తించడంలో ఎలాంటి లోపాలు, పొరపాట్లు లేకుండా చూసుకోవాలని ఆయన మరింతగా నొక్కి చెప్పారు. ఆగస్టు 17 నుంచి మండల స్థాయి ప్రజావాణి రాష్ట్రవ్యాప్తంగా తొలిసారిగా ఆగస్టు 17 నుంచి మండల స్థాయి ప్రజావని కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు డాక్టర్ చిన్నారెడ్డి తెలిపారు. ఇందుకోసం అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమం తరహాలో మండల స్థాయిలో ఈ క్రింది ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. పౌరుల కోసం శాఖల వారీగా సహాయ, ఫిర్యాదుల కేంద్రాలు, దరఖాస్తులు రాయడంలో, సమర్పించడంలో ప్రజలకు సహాయపడే సహాయ కేంద్రాలు, తగినన్ని వైద్య సేవలు, తాగునీటి సౌకర్యాలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, సహాయం, ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించేందుకు వివిధ శాఖల అధికారుల మధ్య సరైన సమన్వయం, ప్రజలు తమ సమస్యలను తెలియజేసేటప్పుడు లేదా పరిష్కారాలు కోరేటప్పుడు అనవసర ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండే విధంగా మండల స్థాయి వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. ప్రజావాణికి బాధ్యత వహించే అధికారులు ప్రజలే యజమానులని, ప్రభుత్వ అధికారులు వారి సేవకులని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని రాష్ట్ర నోడల్ అధికారి కె. విద్యాసాగర్ అన్నారు. ప్రభుత్వ అధికారులు "ప్రజా సేవకులు" అనే ప్రాథమిక సూత్రాన్ని ఎన్నటికీ మరచిపోకూడదని ఆయన అన్నారు. మండల, జిల్లా నోడల్ అధికారులు తమ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజల సమస్యల పరిష్కారాన్ని ఒక ముఖ్యమైన కర్తవ్యంగా, బాధ్యతగా భావించాలని విద్యాసాగర్ సూచించారు. అధికారులు కేవలం దరఖాస్తులను స్వీకరించడమే కాకుండా, నిజమైన సమస్యలను సరిగ్గా పరిశీలించి, పరిష్కరించే బాధ్యతను కూడా తీసుకోవాలని ఆయన నొక్కి చెప్పారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రజావాణి సంబంధిత వ్యవహారాలను పర్యవేక్షించే ఓఎస్‌డీ, అధికారి అయిన వేముల శ్రీనివాసులు, అనేక సమస్యలు, ఆందోళనలతో ప్రజావాణిని ఆశ్రయించే ప్రజలకు భరోసా, విశ్వాసం కల్పించాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎంపీడీఓలకు సూచించారు. ప్రజలు తరచుగా వివిధ కారణాల వల్ల ప్రజావాణిని ఆశ్రయిస్తారని ఆయన అన్నారు.








## హిందూ ముస్లింల మధ్య నాకు వ్యత్యాసం లేదు

మొదటి పేజీ తరువాయి.. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌తో పాటు నిపుణులతో సమాలోచనలు జరిపి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తిగా ప్రక్షాళన చేశాం. రాష్ట్రంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలను అడ్డుకోవాలని అనేక అడ్డంకులు సృష్టించారు. మీరంతా మా కుటుంబ సభ్యులుగా భావించి హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు ఉద్దండులైన న్యాయవాదులను నియమించి పోరాటం చేసి నియామకాలను పూర్తి చేశాం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.




## ప్రఖ్యాత 'న్యూయార్క్ టైమ్స్'లో అమరావతిపై స్పెషల్ స్టోరీ

అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టుపై అమెరికాకు చెందిన ప్రఖ్యాత పత్రిక 'ది న్యూయార్క్ టైమ్స్' (NYT) ఆగస్టు 13న "ఒక వ్యక్తి సంకల్పంతో భారత్‌లో అత్యంత నివాసయోగ్య నగరాన్ని నిర్మించే యత్నం" (One Man's Quest to Build India's Most Livable City) అనే శీర్షికతో ఒక సమగ్ర కథనాన్ని ప్రచురించింది. కృష్ణా నది ఒడ్డున ఒకప్పుడు అరటి తోటలు, కూరగాయల పొలాలతో ఉన్న ప్రాంతంలో, ఇప్పుడు స్వతంత్ర భారతదేశంలోనే అతిపెద్ద పట్టణ ప్రణాళిక రూపుదిద్దుకుంటున్న తీరును ఈ కథనం కళ్లకు కట్టింది.

**'ది న్యూయార్క్ టైమ్స్' కథనం ప్రకారం...**

సుమారు 5 కోట్ల జనాభా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భవిష్యత్ అవసరాలకు తగినట్లుగా, ప్రపంచంలోనే అత్యంత నివాసయోగ్య నగరంగా అమరావతిని తీర్చిదిద్దాలన్నది చంద్రబాబు లక్ష్యం. ఇందుకోసం సుమారు 30,000 మంది రైతుల నుంచి 35,000 ఎకరాల భూమిని సమీకరించారు. ప్రస్తుతం ప్రతిరోజూ 25,000 మందికి పైగా కార్మికులు నిర్మాణ పనుల్లో పాలుపంచుకుంటూ ఈ మహాయజ్ఞాన్ని ముందుకు నడిపిస్తున్నారు. ప్రఖ్యాత బ్రిటిష్ ఆర్కిటెక్ట్ నార్మన్ ఫోస్టర్ దీనికి అద్భుతమైన డిజైన్ అందించారు. నగరం మధ్యలో ఎత్తైన గోపురంతో శాసనసభ భవనం, దాని చుట్టూ మంచినీటి సరస్సు, ఐదు మైళ్ల పొడవునా ప్రభుత్వ భవనాలతో కూడిన గ్రిడ్ లేఅవుట్‌తో నగరాన్ని నిర్మిస్తున్నారు.

అమరావతి కేవలం కాంక్రీట్ జంగిల్ కాదని, పర్యావరణ హితమైన జీవనశైలికి పెద్దపీట వేస్తున్నారని NYT తన కథనంలో పేర్కొంది. నగరంలో దాదాపు 60 శాతం ప్రాంతం పచ్చదనం లేదా నీటి వనరులతో నిండి ఉండేలా ప్రణాళికలు రూపొందించారు. సైక్లింగ్ కోసం సుమారు 2,000 మైళ్ల ప్రత్యేక లేన్లు, నగరమంతా విస్తరించిన కాలువలు, జలమార్గాలు దీని ప్రత్యేకత. వికేంద్రీకరణ ఉత్తమమని కొందరు నిపుణులు సూచించినప్పటికీ, ఒకే కేంద్రీకృత రాజధాని ద్వారా ఆధునిక, సమర్థవంతమైన పాలన అందించాలన్న బలమైన సంకల్పంతో చంద్రబాబు ఈ ప్రాజెక్టును ముందుకు నడిపిస్తున్నారని ఈ కథనం విశ్లేషించింది. ఆయన నాయకత్వంలో రాజకీయ మార్పుల అనంతరం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నగరం కేవలం పరిపాలనకే పరిమితం కాకుండా, అత్యాధునిక టెక్నాలజీకి కేంద్రంగా మారనుంది. ఇందులో భాగంగా 50 ఎకరాల విస్తీర్ణంలో 'క్వాంటం వ్యాలీ' పేరుతో ఒక టెక్ హబ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే వందల మిలియన్ల డాలర్ల పెట్టుబడులు దీనికి ఖరారయ్యాయి. ఇక్కడ భూకంపాలను తట్టుకునేలా నిర్మించిన భవనంలో వచ్చే ఏడాది జనవరి నుంచి 156-క్యూబిట్ సామర్థ్యమున్న ఐబీఎం క్వాంటం కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రపంచ బ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ సంస్థలు తొలి దశ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తున్నాయి. పోల్స్ లేని నగరం, గ్రీన్ ఎనర్జీ, డీప్-టెక్నాలజీతో 2028 నాటికి పూర్తిస్థాయిలో నగరాన్ని ఆవిష్కరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం మీద, చంద్రబాబు వ్యక్తిగత పర్యవేక్షణలో అమరావతి నిర్మాణం ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తోందని 'న్యూయార్క్ టైమ్స్' అభివర్ణించింది.





Share full article 10

This story is free to read.

In one corner of the vast construction site, engineers are rerouting water into miles of canals that will spread like arteries around the new urban space.

In another, workers in hard hats are pouring concrete for a state-of-the-art building that will soon host India's largest quantum computer — part of a broader project labeled "The Quantum Valley."

Here, on what used to be banana groves and vegetable fields on the banks of the sacred River Krishna, the ambition of building India's most livable city of the future is taking shape.

Erecting Amaravati as the new capital city for Andhra Pradesh, a state of 50 million people in India's south, is an enormous task — the largest such exercise in urban planning in independent India. The country's track record brings little confidence. Its major cities, marked by inadequate infrastructure and increasing pollution, have become notorious for failing to meet the needs of their massive populations.

ADVERTISEMENT


Share full article 10

The man who has taken it upon himself to change that is N. Chandrababu Naidu, the state's 76-year-old chief minister. He has an obsessive eye for detail and a history of delivering projects of transformational scale. But he has also had setbacks, losing control of another state capital he helped build decades ago, along with legal battles and a stretch in the political wilderness.

N. Chandrababu Naidu, left, the chief minister of Andhra Pradesh, with Prime Minister Narendra Modi in May.

nytimes.com


Share full article 10

Mr. Naidu has won the support of India's powerful prime minister, Narendra Modi. He has set construction timelines in an effort to make the project an irreversible reality by the time his party faces re-election in 2029.

More than 25,000 people are working at the site on any given day, building a design by Norman Foster, the celebrated British architect. The city is laid out in grids and includes about a five-mile stretch of government buildings.

ADVERTISEMENT

LOST TAI CHI WALKING METHOD BASED ON YOUR AGE

HAЯNA

nytimes.com

## చంచల్‌గూడ స్టీల్ బ్రిడ్జ్‌కు సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి

మొదటి పేజీ తరువాయి... అందించారని, మెదక్ స్థానం నుంచి వరుసగా మూడుసార్లు ఎంపీగా గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టిన తొలి మహిళగా రికార్డు సృష్టించారని వివరించారు. సైదాబాద్‌లో 'ఇందిరా సేవా సదన్' నెలకొల్పి వేలాది మంది పేద బాలికలకు ఆశ్రయం, విద్య అందించిన మహోన్నత వ్యక్తి ఆమె అని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దే విద్యాశాఖ ఉన్నందున, గతంలో విద్యాశాఖ మంత్రిగా సేవలందించిన సంగం లక్ష్మీబాయి పేరును చంచల్‌గూడ - సంతోష్‌నగర్ స్టీల్ బ్రిడ్జ్‌కు నామకరణం చేస్తే ప్రజామోదం లభించడంతో పాటు ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని వీహెచ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విజ్ఞప్తిపై తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని సీఎంను కోరారు.

## నకిలీలకు చెక్.. 9 సెక్యూరిటీ ఫీచర్లతో తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డులు!

- ఆగస్టు 15 నుంచి తెలంగాణలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- నకిలీలను అరికట్టేందుకు 9 రకాల భద్రతా ఫీచర్ల జోడింపు
- సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అధికారిక ప్రారంభం
- క్యూఆర్ కోడ్, హోలోగ్రామ్, యూవీ లోగో వంటి అత్యాధునిక ఫీచర్లు
- ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెంచడమే లక్ష్యమని వెల్లడి




హైదరాబాద్, నవతరం: తెలంగాణలో రేషన్ కార్డుల దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు నకిలీ కార్డులకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో కూడిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను జారీ చేసేందుకు సిద్ధమైంది. మొత్తం తొమ్మిది రకాల సెక్యూరిటీ ఫీచర్లతో రూపొందించిన ఈ కార్డుల పంపిణీని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ప్రారంభించనున్నారు. సంగారెడ్డి వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించి, సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా పౌరసరఫరాల శాఖ ఈ నూతన కార్డులను అందుబాటులోకి తీసుకువస్తోంది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, ఈ కార్డులలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ అధికారిక సంతకం, తెలంగాణ ప్రభుత్వ అధికారిక హోలోగ్రామ్‌తో పాటు, స్పర్శతో గుర్తించేలా "గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ" అనే అక్షరాలు ఉంటాయి. సాధారణ ముద్రణతో నకిలీ చేయడానికి వీలులేని మైక్రోటెక్స్ట్, ప్రత్యేక కోణంలో చూసినప్పుడు మాత్రమే కనిపించే 'GoTG', 'Original' వంటి పదాలను కూడా ఇందులో పొందుపరిచారు.

వీటితో పాటు, కాంతికి ఎదురుగా ఉంచినప్పుడు కనిపించే వాటర్‌మార్క్ లోగో, అతినీలలోహిత కాంతిలో మెరిసే ఇన్విజిబుల్ లోగో, కార్డు వివరాలను ధ్రువీకరించే ఎన్‌క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్, గిలోష్ ప్యాటర్న్ వంటి అత్యాధునిక సాంకేతికతను జోడించారు. కరెన్సీ నోట్లు, పాస్‌పోర్టుల తయారీలో అనుసరించే అత్యున్నత భద్రతా ప్రమాణాలను ఈ కార్డుల తయారీలోనూ పాటించడం ద్వారా నకిలీ కార్డుల ముద్రణను పూర్తిగా నిరోధించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.6 కోట్ల ఆహార భద్రత కార్డులు ఉండగా, వాటి ద్వారా 3.43 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారు. ఈ నూతన స్మార్ట్ కార్డుల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు సక్రమంగా అందేలా చూడటమే తమ అంతిమ లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## మా సార్ మాకే కావాలి.. రోడ్డెక్కిన విద్యార్థులు, వెనక్కి తగ్గిన ఝార్ఖండ్ ప్రభుత్వం

- ఝార్ఖండ్‌లో హెడ్ మాస్టర్ బదిలీపై విద్యార్థుల ఆందోళన
- మూడు రోజులుగా ప్రధాన రహదారిని దిగ్బంధించిన విద్యార్థులు
- నచ్చజెప్పబోయిన అధికారిపై దాడి, పోలీస్ స్టేషన్‌పై రాళ్లదాడి
- దిగివచ్చిన అధికారులు, హెడ్ మాస్టర్ బదిలీ ఉత్తర్వులు రద్దు
- ఉపాధ్యాయుడితో ఫోన్‌లో మాట్లాడి ఆందోళన విరమించిన విద్యార్థులు



జార్ఖండ్, నవతరం: ఝార్ఖండ్‌లో తమ అభిమాన హెడ్ మాస్టర్‌ను బదిలీని నిరసిస్తూ విద్యార్థులు చేపట్టిన ఆందోళన ఫలించింది. విద్యార్థుల పట్టుదల ముందు అధికారులు తలొగ్గక తప్పలేదు. మూడు రోజుల పాటు ఉద్ధృతంగా సాగిన నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులను ఉపసంహరించుకుంది. గఢ్వా జిల్లా కండి బ్లాక్‌లోని ప్రభుత్వ ప్లస్ టూ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ మలయ్ కుమార్ సింగ్‌ను అధికారులు ఇటీవల బదిలీ చేశారు. ఆయన హయాంలో పాఠశాల గణనీయమైన అభివృద్ధి సాధించిందని భావించిన విద్యార్థులు, ఈ బదిలీని తీవ్రంగా వ్యతిరేకించారు. పలువురు విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని కండి-భవనాథ్‌పూర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. "మా సార్ మాకే కావాలి" అంటూ నినాదాలు చేస్తూ గంటల తరబడి ట్రాఫిక్‌ను స్తంభింపజేశారు. గురువారం నాడు ఆందోళన మరింత తీవ్రరూపం దాల్చింది.

ఆందోళన చేస్తున్న విద్యార్థులకు నచ్చజెప్పేందుకు వచ్చిన కండి బ్లాక్ చీఫ్ సత్యేంద్ర పాండే, ఒక విద్యార్థిపై చేయి చేసుకున్నట్లు ఆరోపణలు రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో ఆగ్రహానికి గురైన విద్యార్థులు ఆయన వాహనంపై దాడి చేశారు. రక్షణ కోసం ఆయన సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఆశ్రయం పొందగా, కొందరు విద్యార్థులు స్టేషన్‌పైకి రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో ఒక పోలీసు అధికారి తలకు గాయమైంది.

పరిస్థితి తీవ్రతను గమనించిన ఉన్నతాధికారులు రంగంలోకి దిగి విద్యార్థులతో చర్చలు జరిపారు. వారి డిమాండ్‌కు అంగీకరిస్తూ ప్రధానోపాధ్యాయుడు మలయ్ సింగ్ బదిలీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం విద్యార్థులతో ఫోన్‌లో ఆయనను మాట్లాడించడంతో వారు శాంతించి, తమ ఆందోళనను విరమించారు.

## జనరేషన్ గట్టర్ వ్యాఖ్యలపై కంగనా రనౌత్ మరోసారి వివరణ

- తన మాటలను పూర్తిగా వక్రీకరించారని స్పష్టీకరణ
- దేశంలోని యువత మొత్తాన్ని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేయలేదని వెల్లడి
- కొందరు నిరసనకారుల ప్రవర్తనపైనే తాను స్పందించానన్న కంగన



తన 'జనరేషన్ గట్టర్' వ్యాఖ్యలపై నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ మరోసారి వివరణ ఇచ్చారు. దేశంలోని యువత మొత్తాన్ని ఉద్దేశించి తాను ఆ వ్యాఖ్యలు చేయలేదని, తన మాటలను కొందరు వక్రీకరించారని ఆమె స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక వీడియోను విడుదల చేశారు. దేశ యువతను తాను 'గట్టర్ ఛాప్‌లు' అని సంబోధించినట్లు ఒక కాంగ్రెస్ నేత చేసిన విమర్శలపై ఆమె ఘాటుగా స్పందించారు. గత జూలైలో జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో సుమారు 10,000 మంది పాల్గొంటే, అందులో 2,000 మంది మాత్రమే జెన్-జీ యువత ఉన్నారని, మిగిలిన వారు వేర్వేరు వయసుల వారని ఆమె తెలిపారు. ఆ నిరసనకారుల్లో షబానా అజ్మీ తరహా పెద్దలు కూడా ఉన్నారని ఆమె పేర్కొన్నారు. "దేశంలో జెన్-జీ జనాభా సుమారు 30 నుంచి 35 కోట్లు ఉంటుంది. అలాంటప్పుడు కొద్దిమంది పాల్గొన్న నిరసనను జెన్-జీ నిరసనగా ఎలా అభివర్ణిస్తారు?" అని కంగన రనౌత్ ప్రశ్నించారు. యువత మొత్తాన్ని తాను కించపరిచినట్లు ఒక్క ఆధారం చూపించినా దేనికైనా సిద్ధమని ఆమె సవాల్ విసిరారు. "నేను యువతకు వ్యతిరేకం కాదు, ఎందుకంటే నేను కూడా యువతనే. రాహుల్ గాంధీలా నాకు 55-60 ఏళ్ల వయస్సు లేదు" అంటూ ఆమె చురకలంటించారు.



# రేషన్‌కార్డులు నిరుపేదలకోసమా.. లేక గణాంకాల కోసమా?

- బియ్యం ఒక్కటే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు
- కార్డు లేకపోతే ఆరోగ్యశ్రీ, పెన్షన్, ఇల్లు ఏదీ లేదు
- ఆహారభద్రత లక్ష్యం నుంచి తప్పుకుంటున్నాం
- ప్రముఖ సామాజికవేత్త డా. నిమ్మాన దాస్



సోంపేట, నవతరం ప్రతినిధి: రేషన్‌కార్డుల అసలు లక్ష్యం ఆహారభద్రత. కానీ ప్రస్తుతం ఆ కార్డులు పేదలకు పూర్తిస్థాయి ప్రయోజనాన్ని అందించలేకపోతున్నాయి. ఆ కార్డును ఇతర ప్రభుత్వ పథకాలకు అర్హతగా పరిగణించడం దాని అసలు ఉద్దేశ్యాన్ని దెబ్బతీస్తోంది. పాలక పార్టీలు అధికార కాంక్షలకు ఆ కార్డులను ఆయుధంగా వాడుకుంటున్నాయి. రేషన్‌కార్డుల ద్వారా కనీస సరుకులు ఇవ్వాల్సిందిపోయి, బియ్యమొక్కటేనన్న దుస్థితికి లబ్దిదారులను నెట్టేశారు. గతంలో ఇంటింటికి సరుకులు చేరిన పరిస్థితి నుంచి, ఇప్పుడు మళ్లీ షాపుల చుట్టూ తిరిగే దుస్థితికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆహారభద్రత లక్ష్యాలు, ప్రస్తుత విధానాలపై ప్రముఖ సామాజికవేత్త డా. నిమ్మాన దాస్ తో నవతరం దినపత్రిక ప్రతినిధి మాట్లాడారు.

ప్రశ్న: రేషన్‌కార్డుల ఆహారభద్రత లక్ష్యాలు ఏమిటి? వివరంగా చెప్పండి.

డా. నిమ్మాన దాస్: రేషన్ వ్యవస్థను తీసుకొచ్చినప్పుడు దీని వెనుక చాలా స్పష్టమైన లక్ష్యాలు ఉన్నాయి. ముఖ్యంగా 3 ప్రధాన లక్ష్యాలు. మొదటిది కనీస పోషకాహారం అందించడం. దేశంలో ఆకలి చావులు లేకుండా చూడడం, ప్రతి పేదవాడి కడుపు నింపడం. దీని కోసమే బియ్యం, గోధుమలు, పప్పులు, నూనె, ఉప్పు, చక్కెర వంటి నిత్యావసరాలను సబ్సిడీపై ఇచ్చేవారు. ఉమ్మడి రాష్ట్రంలో ఒకప్పుడు 9 రకాల సరుకులు ఇచ్చేవారు. బియ్యంతోపాటు కంది, గోధుమలు, పామాయిల్, ఉప్పు, చక్కెర, చింతపండు, కారం, పసుపు ఇచ్చేవారు. అప్పట్లో కిరోసిన్ కూడా ఉండేది. దీనివల్ల పేదవాడు నెలకు కనీసం 15 రోజులకు సరిపడా సరుకులు తెచ్చుకునేవాడు. రెండవది ధరల స్థిరీకరణ. బహిరంగ మార్కెట్ లో ఏదైనా సరుకు ధర పెరిగినా, రేషన్ ద్వారా స్థిరమైన ధరకు సరుకులు అందుబాటులో ఉండేవి. దీనివల్ల పేదవాడు ద్రవ్యోల్బణం బారిన పడకుండా ఉండేవాడు. మూడవది అత్యంత కీలకమైనది పోషకాహార లోపాన్ని నివారించడం. ముఖ్యంగా పిల్లలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు. కేవలం బియ్యం ఇస్తే కడుపు నిండుతుంది కానీ పోషకాలు అందవు. పప్పు, నూనె, ఇతర సరుకులు ఇచ్చినప్పుడే శరీరానికి కావాల్సిన ప్రోటీన్లు, విటమిన్లు అందుతాయి. అప్పుడే రక్తహీనత, బరువు తగ్గడం వంటి సమస్యలు తగ్గుతాయి. ఇదే అసలు ఆహారభద్రత అంటే.

ప్రశ్న: వైయస్సార్‌సీపి ప్రభుత్వ హయాంలో పంపిణీ విధానం ఎలా ఉండేది? దాని ప్రయోజనాలు ఏమిటి?

డా. నిమ్మాన దాస్: వైయస్సార్‌సీపి ప్రభుత్వ హయాంలో ఆహార భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ఆ సమయంలో ప్రధానంగా రేషన్ సరుకులను నేరుగా లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పంపిణీ చేసే "గడప గడపకు రేషన్" విధానాన్ని అమలు చేశారు. ఇది ఒక విప్లవాత్మక నిర్ణయం. దీని వల్ల కలిగిన లాభాలు అనేకం. ఒకటి, వృద్ధులు, వికలాంగులు, రోజు కూలీ చేసుకునే వారు రేషన్ షాపు కోసం రోజంతా క్యూలో నిలబడాల్సిన అవసరం లేకుండా పోయింది. రెండు, సరుకుల్లో జరిగే అక్రమాలు, బ్లాక్ మార్కెట్, బరువుల్లో తక్కువ ఇవ్వడం వంటివి దాదాపుగా ఆగిపోయాయి. మూడు, ప్రతి నెలా సకాలంలో ఇంటికి సరుకులు రావడం వల్ల కుటుంబం ఆహార ప్రణాళిక సులభమైంది. అప్పుడు ప్రభుత్వం ఆహారభద్రతను ఒక హక్కుగా చూసింది. రేషన్ అంటే కేవలం బియ్యం ఇవ్వడం కాదు, గౌరవంగా జీవించే హక్కు ఇవ్వడం అని భావించారు. ఆ విధానం వల్ల లక్షలాది పేద కుటుంబాలకు నిజమైన ఉపశమనం కలిగింది.

ప్రశ్న: ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో పరిస్థితి ఎలా ఉంది? ఏమేం మార్పులు వచ్చాయి?

డా. నిమ్మాన దాస్: ఇప్పుడు పరిస్థితి పూర్తిగా రివర్స్ అయ్యింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంటింటికి రేషన్ పంపిణీ విధానాన్ని రద్దు చేశారు. దీనివల్ల నిరుపేదలు మళ్లీ పాత రోజులకు వెళ్లిపోయారు. మళ్లీ రేషన్ షాపుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. పని మానుకుని లైన్లలో నిలబడాల్సి వస్తోంది. ఇది ఒక పెద్ద దెబ్బ అయితే, రెండవ పెద్ద దెబ్బ సరుకుల తగ్గింపు. సంచిని మొత్తం ఖాళీ చేసి పూర్తిగా బియ్యంతో నింపేశారు. ఒట్టి బియ్యమిచ్చి అదే పదివేలు అన్నచందంగా మార్చేశారు. ఇది ఆహారభద్రత లక్ష్యానికి పూర్తి విరుద్ధం. దీని పర్యవసానం ఏమైంది? సామాన్యులు పోషకాహార లోపాన్ని తీవ్రంగా ఎదుర్కోవాల్సి వస్తోంది. ముఖ్యంగా పిల్లలు, మహిళలు రక్తహీనతకు లోనై అనారోగ్యం పాలవుతున్నారు. పిల్లల ఎదుగుదల మందగిస్తోంది. జాతీయ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం ఉండాల్సిన బరువును కూడా కోల్పోతున్నారు. అంటే ప్రభుత్వమే ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే పనికి పాల్పడుతోంది. ప్రశ్న: రేషన్‌కార్డును ఇతర పథకాలకు వాడడం వల్ల వచ్చే నష్టం ఏమిటి?

డా. నిమ్మాన దాస్: ఇది చాలా ప్రమాదకరమైన పోకడ. అన్ని సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు ప్రాథమిక KYCగా మారిపోయింది. నేడు రేషన్‌కార్డు ఒక 'మాస్టర్ కీ'గా మారిపోయింది. కార్డు లేకపోతే ఆరోగ్యశ్రీ లేదు, పెన్షన్ లేదు, ఇల్లు లేదు, విద్యార్థి ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదు. ఇది కార్డు యొక్క అసలు ఉద్దేశ్యాన్ని పూర్తిగా దెబ్బతీస్తోంది. రేషన్ కార్డు ఆహారం కోసం కాకుండా, ఇతర లబ్ధి కోసం అడిగే పరిస్థితి వచ్చింది. ఇక్కడే పాలక పార్టీలు అధికార కాంక్షలకు ఆ కార్డులను ఆయుధంగా వాడుకుంటున్నాయి. ఓట్లు, సీట్ల రాజకీయాలు చేస్తున్నాయి. ఎవరికి కార్డు ఇవ్వాలి, ఎవరికి రద్దు చేయాలి అనేది కూడా రాజకీయ ప్రయోజనాల ఆధారంగా నిర్ణయిస్తున్నారు. కార్పొరేట్లకు లక్షల కోట్ల రాయితీలిస్తున్నాయి. నిరుపేదలకొచ్చేసరికి మాత్రం లెక్కలు కడుతున్నాయి. ఒక సరుకు తగ్గిస్తే ఎంత ఆదా అవుతుందని చూస్తున్నారు. ఇది సరైన విధానం కాదు.

ప్రశ్న: ప్రస్తుతం కార్డుల పంపిణీ, రద్దుల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా?

డా. నిమ్మాన దాస్: చాలా ఉన్నాయి. నూతనంగా పెళ్లి చేసుకున్న జంటలకు ప్రత్యేకంగా కార్డులు మంజూరు కావడం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులకు కార్డులు లేవు. వారికి ఆహారభద్రత కరువైంది. ఇక ఉన్న కార్డుల రద్దు కూడా విచక్షణారహితంగా జరుగుతోంది. చిన్న చిన్న కారణాలు చూపించి కార్డులు తీసేస్తున్నారు. ఆదాయ పరిమితి దాటిందని, వాహనం ఉందని ఇలా కారణాలు. కానీ నిజంగా అవసరమైన వాళ్లు కూడా ఈ జాబితాలో బలైపోతున్నారు. ఇప్పుడు కొత్తగా తెల్ల రేషన్‌కార్డుల పంపిణీ చేపట్టినా, అది కేవలం సంఖ్యల కోసమే. కార్డుల సంఖ్యను పెంచితే సరిపోతుందనే భావనలో ప్రభుత్వం ఉంది. అదే గొప్పగా వ్యవహరిస్తున్నది. కానీ ఆ కార్డుతో వచ్చే లాభం ఏమిటి? బియ్యం తప్ప మరేమీ లేదు. దీనివల్ల నిరుపేదల కనీసావసరాలు తీరడం లేదు.

ప్రశ్న: ఇతర రాష్ట్రాల్లో ఏమైనా మంచి నమూనాలు ఉన్నాయా? వాటిని మనం అనుసరించవచ్చా?

డా. నిమ్మాన దాస్: తప్పకుండా అనుసరించాలి. వామపక్ష ప్రభుత్వం ఉన్న కేరళలో 14 రకాల సరుకులను అందిస్తున్నారు. బియ్యం, గోధుమపిండి, పప్పులు, నూనె, చక్కెర, మసాలాలు, టీ పొడి వరకు ఇస్తున్నారు. అక్కడ రేషన్ దుకాణాలను "సుపీక్వేట్" పేరుతో సూపర్ మార్కెట్లలా మార్చారు. తమిళనాడులో కూడా అనేక రకాల సరుకులు ఇస్తారు. ఛత్తీస్‌గఢ్ లో ఇంటింటికి పంపిణీ బాగా ఉంది. ఈ రాష్ట్రాల విధానాలను అధ్యయనం చేసి, మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా అమలు చేయాలి. కేవలం బియ్యం ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదు.

ప్రశ్న: చివరగా ప్రభుత్వానికి, ప్రజలకు మీ సూచన ఏమిటి?

డా. నిమ్మాన దాస్: ప్రభుత్వానికి నా సూచన ఒకటే. పేరుకు కార్డులిచ్చి 'తాంబూలాలిచ్చాం తన్నుకు చావండి' అంటే సరిపోదు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్న హామీలు ఆచరణలో రుజువు చేయాలి. ముందుగా రేషన్‌లో కనీసం 8 నుంచి 10 రకాల సరుకులు ఇవ్వాలి. రెండవది, మళ్లీ ఇంటింటికి రేషన్ పంపిణీని ప్రారంభించాలి. మూడవది, కార్డును రాజకీయాలకు అతీతంగా, అర్హులందరికీ ఇవ్వాలి. రేషన్‌కార్డును బలోపేతం చేస్తేనే నిరుపేద కడుపు నిండుతుంది. ఈ విషయాన్ని పాలకులు గుర్తెరగాలి. ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలి. లేదంటే భవిష్యత్తులో రేషన్ కార్డు అంటే పథకాలకు లబ్దిదారులను గుర్తించడానికే అని అనుకోవాల్సి వస్తుంది. అది ఈ వ్యవస్థకు, ఈ దేశానికి చేసే అతి పెద్ద అన్యాయం అవుతుంది. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. తమ హక్కుల కోసం ప్రశ్నించాలి. ఆహారం అనేది దయాదాక్షిణ్యం కాదు, అది రాజ్యాంగం ఇచ్చిన హక్కు. ఆ హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

# “లుంగీ వేసుకుంటే తప్పా? భిన్నత్వంలో ఏకత్వానికే గౌరవం - రాజ్యసభలో లుంగీ వివాదం”

- దక్షిణాది సంస్కృతిపై ఉద్దేశపూర్వక వ్యాఖ్యల ఆరోపణ - బిజెపి వర్సెస్ సిపిఎం మాటల యుద్ధం
- ‘లంగీవాలా’ వ్యాఖ్యలు ప్రివిలేజ్ నోటీసు వరకు వెళ్లాయని జాన్ బ్రిట్టాస్ ఆగ్రహం
- లౌకిక భారతంలో దుస్తుల రాజకీయం సరికాదు, కోట్లాది మంది ఒకటే అనే స్ఫూర్తి దెబ్బతింటోందా?

రాజ్యసభలో ఇటీవల చోటు చేసుకున్న ఒక సంఘటన దేశ రాజకీయాల్లోనే కాకుండా సామాజిక వర్గాల్లోనూ తీవ్ర చర్చకు దారి తీసింది. దక్షిణ భారతీయుల సంప్రదాయ దుస్తు అయిన లంగీని కేంద్రంగా చేసుకుని బిజెపి, సిపిఎం మధ్య మాటల యుద్ధం ప్రారంభమైంది. రాజ్యసభలో జరిగిన చర్చ సందర్భంగా బిజెపి రాజ్యసభ సభ్యురాలు సుస్మిత సేన్ దక్షిణాది సభ్యులను ఉద్దేశించి 'లంగీవాలా' అనే పదాన్ని ఉద్దేశపూర్వకంగానే సంబోధించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యాఖ్యలు దక్షిణ భారతీయుల ఆత్మగౌరవాన్ని, సాంస్కృతిక అస్మితను దెబ్బతీసేలా ఉన్నాయని సిపిఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆయన రాజ్యసభ అధ్యక్షులకు ప్రివిలేజ్ నోటీసు సమర్పించారు. ఒక సభ్యుడు మరో సభ్యుని పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం పార్లమెంటరీ మర్యాదలకు విరుద్ధమని, దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలను సుస్మిత సేన్ తీవ్రంగా ఖండించారు. తాను ఏ సంస్కృతినీ కించపరిచే ఉద్దేశంతో మాట్లాడలేదని, తన మాటలను తప్పుగా అర్థం చేసుకున్నారని వివరణ ఇచ్చారు. రాజకీయ లబ్ధి కోసమే జాన్ బ్రిట్టాస్ ఈ వివాదాన్ని పెద్దది చేస్తున్నారని ఆమె కౌంటర్ ఇచ్చారు. ఇది రాజకీయ ప్రయోజనం కోసమే తప్ప వేరే ఉద్దేశం ఏమీ లేదని ఆమె పేర్కొన్నారు. ఈ వివాదంపై బిజెపి జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ అధ్యక్షులు ఏ విధంగా స్పందిస్తారనే దానిపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. మీడియాలో, సామాజిక మాధ్యమాలలో ఈ అంశం లంగీ వివాదం, దక్షిణ భారతం, బిజెపి వర్సెస్ సిపిఎం అనే పేర్లతో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. లుంగీ అనేది కేవలం ఒక దుస్తు మాత్రమే కాదు. అది దక్షిణాది జీవన విధానంలో భాగం. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో రైతు నుంచి ఉపాధ్యాయుడి వరకు, కార్మికుడి నుంచి న్యాయవాది వరకు అన్ని వర్గాల ప్రజలు రోజువారీ జీవితంలో లంగీని ధరిస్తారు. వేడి వాతావరణానికి అనుకూలంగా ఉండటం, సౌకర్యవంతంగా ఉండటం దీని ప్రత్యేకత. అలాంటి దుస్తును లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం అంటే కోట్లాది మంది జీవన విధానాన్ని ప్రశ్నించడమే అవుతుంది. అందుకే జాన్ బ్రిట్టాస్ సభలో లంగీ వేసుకుంటే తప్పా అని ప్రశ్నించారు. నేను ఒక దక్షిణ భారతీయుడిని అని గర్వంగా చెప్పారు. ఒక ప్రాంత సంస్కృతిని ఎగతాళి చేయడం అనేది ఆ ప్రాంత ప్రజలందరినీ అవమానించడమే అని ఆయన అభిప్రాయపడ్డారు. భారతదేశం లౌకికవాద దేశం. రాజ్యాంగం ప్రతి పౌరుడికి తన భాష, లిపి, సంస్కృతిని కాపాడుకునే హక్కు కల్పించింది. దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతుల పట్ల గౌరవం చూపాలని రాజ్యాంగం స్పష్టంగా చెబుతోంది. కాశ్మీర్‌లో ఫేరన్, పంజాబ్‌లో కుర్తా పైజామా, బెంగాల్‌లో ధోతీ కుర్తా, మహారాష్ట్రలో నవారి, గుజరాత్‌లో చనియా చోళి, దక్షిణాదిలో లంగీ చొక్కా. ఇవన్నీ భారతీయతకు విభిన్న రంగులు. ఏ రంగును తక్కువ చేయకుండా, ఏ రంగును ఎక్కువ చేయకుండా అన్ని రంగులు కలిస్తేనే మన జాతీయ పతాకం పరిపూర్ణంగా ఉంటుంది. పార్లమెంట్ లాంటి అత్యున్నత సభలో ప్రజా ప్రతినిధులు మాట్లాడేటప్పుడు ఈ అంశాలను తప్పనిసరిగా గుర్తుంచుకోవాలి. భారతదేశ ఐక్యతకు మూలం భిన్నత్వంలో ఏకత్వం. వేల సంవత్సరాలుగా మన దేశం ఈ సిద్ధాంతంతో నడుస్తోంది. ఈ స్ఫూర్తిని వివరిస్తూ జాతిపిత మహాత్మా గాంధీ చెప్పిన మాట నేటికీ మనకు మార్గదర్శకం. “ఎవరి సంస్కృతిని చూసి భయపడనవసరం లేదు. కానీ ఏ సంస్కృతిని కూడా చులకన చేయకూడదు” అంటే మనం మన సంస్కృతిని గర్వంగా కాపాడుకోవాలి. అదే సమయంలో ఇతరుల సంస్కృతిని గౌరవించాలి. ఒకరిని అవమానిస్తే దేశమంతా బలహీనపడుతుంది. ఇలాంటి సంఘటనలు ప్రజాస్వామ్యంలో ఆరోగ్యకరమైన చర్చకు అవరోధంగా మారుతున్నాయి. పార్లమెంట్ అనేది ప్రజా సమస్యలపై చర్చించే ప్రదేశం. నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతు సమస్యలు, విద్య, వైద్యం లాంటి అంశాలపై దృష్టి పెట్టాల్సిన సభలో దుస్తుల పేరిట వాదనలు జరగడం బాధాకరం. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రతినిధులను ఎన్నుకుంటారు. కానీ ప్రతినిధులు తిరిగి ప్రజల మధ్య చిచ్చు పెడితే ప్రజాస్వామ్యానికి నష్టం జరుగుతుంది. దక్షిణాది రాష్ట్రాలు దేశ ఆర్థిక వ్యవస్థకు, సాంకేతిక రంగానికి, సాఫ్ట్‌వేర్ ఎగుమతులకు చేస్తున్న సేవలను దేశం మొత్తం గుర్తిస్తోంది. అలాంటి సమయంలో ప్రాంతీయ అస్మితను గాయపరచడం దేశ ప్రగతికే విఘాతం. ఈ వివాదం ప్రాంతీయ విభేదాలకు దారి తీసే అవకాశం ఉందని పలువురు సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ పార్టీలు తమ స్వల్ప లబ్ధి కోసం ప్రజల మధ్య చిచ్చు పెట్టడం సరైన పద్ధతి కాదు. ఈరోజు లంగీ, రేపు భాష, మరుసటి రోజు ఆహారం. ఇలా ప్రతి చిన్న అంశాన్ని వివాదంగా మార్చి మేము వాళ్లు అనే భావన పెంచితే నష్టపోయేది దేశమే. ఆకలేస్తే ఉత్తరాది వాడికైనా దక్షిణాది వాడికైనా అన్నం ఒకటే. కన్నీరు వస్తే హిందువుకైనా ముస్లింకైనా రంగు ఒకటే. దేశం కోసం సైనికుడు ప్రాణం ఇచ్చేటప్పుడు అతని దుస్తు కింద కులం, మతం, ప్రాంతం ఉండదు. మరి పార్లమెంట్‌లో మాత్రం ఎందుకు ఈ విభజన రాజకీయాలు. ఈ వివాదం మనకు మూడు ముఖ్యమైన పాఠాలు నేర్పుతోంది. మొదటిది సంస్కృతి పట్ల గౌరవం. ఏ ప్రాంత సంస్కృతినైనా, ఏ ప్రాంత దుస్తునైనా కించపరిచే హక్కు ఎవరికీ లేదు. లంగీని ఎగతాళి చేయడం అంటే దక్షిణాది శ్రమజీవి జీవితాన్ని ఎగతాళి చేయడమే. రెండవది రాజకీయ బాధ్యత. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు మాట్లాడే ప్రతి మాటకు బాధ్యత ఉంటుంది. పదాలు తూటాల్లాంటివి. అవి గాయపరచవచ్చు. కాబట్టి ఆలోచించి మాట్లాడాలి. మూడవది ప్రజల విజ్ఞత. మనం ఇలాంటి ఉచ్చుల్లో పడకూడదు. ఎవరో రెచ్చగొడితే వెంటనే మేము వేరు, మీరు వేరు అని గొడవపడటం కాదు. మనమంతా భారతీయులం అనే స్పృహతో ఉండాలి. లంగీ కట్టినా, ప్యాంట్ వేసుకున్నా, కుర్తా తొడిగినా గుండెలో మాత్రం త్రివర్ణ పతాకం ఉండాలి అనే భావనతో ఉండాలి. ఇప్పుడు ఈ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించాల్సిన బాధ్యత రాజ్యసభ అధ్యక్షుల పై, అన్ని పార్టీల అధినేతల పై ఉంది. ఎవరి తప్పు ఉంటే వారు సభలోనే స్పష్టత ఇవ్వాలి. అవసరమైతే క్షమాపణ చెప్పాలి. పార్లమెంట్ అనేది చర్చలకు, విధానాలకు, ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక. అది ప్రాంతీయ విభేదాలు రేపే వేదిక కాకూడదు. భారతదేశం గొప్పది కావడానికి కారణం మన వైవిధ్యం. ఆ వైవిధ్యాన్ని కాపాడుకోవడమే మన కర్తవ్యం.



వ్యాసకర్త: ప్రముఖ సామాజికవేత్త, జుత్తు తాతారావు - పలాస

# భార్యపై ప్రేమతో.. మధ్యప్రదేశ్ లో మరో తాజ్ మహల్

మధ్యప్రదేశ్, నవతరం: భార్యపై ప్రేమకు గుర్తుగా మొఘల్ చక్రవర్తి షాజహాన్ తాజ్ మహల్ కట్టించాడన్న విషయం అందరికీ తెలిసిందే. అదే స్ఫూర్తితో మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త తన భార్య కోసం అచ్చం తాజ్ మహల్ లాగే ఓ అందమైన ఇంటిని నిర్మించి తన ప్రేమను చాటుకున్నారు. ఇప్పుడు ఈ ప్రేమ సౌధం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్‌కు చెందిన వ్యాపారవేత్త ఆనంద్ ప్రకాశ్ చౌక్సే, తన భార్యకు కానుకగా ఈ ఇంటిని నిర్మించారు. 2021లో నిర్మాణం పూర్తయిన ఈ ఇల్లు, ఆగ్రాలోని అసలు తాజ్ మహల్‌కు సుమారు 800 కిలోమీటర్ల దూరంలో ఉంది. అసలు కట్టడంలో మూడో వంతు పరిమాణంలో, రెండు అంతస్తుల భవనంగా దీనిని తీర్చిదిద్దారు. ఈ నిర్మాణం పూర్తి చేయడానికి దాదాపు ఒకటిన్నర సంవత్సరం పైగా పట్టింది.

బయటి నుంచి చూస్తే తెల్లని గోడలు, ప్రధాన గుమ్మటం, నాలుగు మినార్లు, అందమైన తోటలతో ఇది అచ్చం తాజ్ మహల్‌ను పోలి ఉంటుంది. ఇంటి లోపల ఇంటీరియర్స్ కూడా అంతే అద్భుతంగా, విశాలంగా ఉంటాయి. సుమారు 24 అడుగుల ఎత్తైన సీలింగ్స్, పాలరాతి ఫ్లోరింగ్, రెండు వైపులా మెట్లు, విలాసవంతమైన ఫర్నిచర్‌తో రాజసం ఉట్టిపడేలా దీనిని రూపొందించారు.

ఇటీవల శుభమ్ ప్రజాపత్ అనే ఓ కంటెంట్ క్రియేటర్ ఈ ఇంటిపై ఓ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడంతో ఇది వైరల్‌గా మారింది. చౌక్సే కుమారుడు ఈ ఇంటి విశేషాలను వివరిస్తున్న వీడియో నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది.



Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com,
Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com